
ఉధృతంగా పడిగోని చెరువు అలుగు


నీటితో కళకళలాడుతున్న కాశీపూర్ చెరువు


నిండిన చెర్లగూడెం పెద్ద చెరువు

నిండుకుండల్లా చెరువులు

ఎడతెరిపి లేని వర్షాలకు మండలంలోని చెరువులు నిండుకుండల్లా మారాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా సరిపడా వర్షాలు కురవక చెరువులు, కుంటలు వెలవెలబోయాయి. ప్రస్తుతం కురుస్తున్నా వర్షాలకు చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. -కంది(సంగారెడ్డి):

క్లుప్తంగా

నానోయూరియాతో ప్రయోజనం


రైతులకు అవగాహన కల్పిస్తున్న అంజలి

మునిపల్లి(అందోల్): పత్తి పంటలపై నానో యూరియా పిచికారీ చేయాలని వ్యవసాయాధికారి అంజలి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని పెద్దలోడి రైతు వేదికలో ఆయా గ్రామాల రైతులకు నానో యూరియా పిచికారీ చేస్తే ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో రైతులకు అవగాహన కల్పించారు. 500 ఎంఎల్ నానో యూరియా ఒక బస్తా యూరియాతో సమానమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అంజన్న, రైతులు పాల్గొన్నారు.

వెంకట్‌రెడ్డికి ప్రశంసా పత్రం


ఎస్ఐకి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎస్ఐ వెంకట్‌రెడ్డికి ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రశంసా పత్రం అందజేశారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్‌తో కలిసి ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా పటాన్‌చెరు సబ్ డివిజన్‌లో 35 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించిన వెంకట్‌రెడ్డిని అభినందించి, ప్రశంసా పత్రం అందజేశారు.

సమయపాలన తప్పనిసరి

ఎంఈఓ శంకర్


విద్యార్థిచే కూడికలు చేయిస్తున్న ఎంఈఓ శంకర్

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈఓ శంకర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రహమత్‌నగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక -3లను ఎంఈఓ శంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రహమత్‌నగర్‌లోని పాఠశాలలో తరగతుల వారీగా విద్యార్థుల సబ్జెక్టులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం వండే వంటగది, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారమే వారానికి మూడుసార్లు గుడ్లు ఇవ్వాలని సూచించారు. నంబర్-3 పాఠశాల పరిసరాలు పైకప్పును పరిశీలించి శుభ్రంగా లేవని వాటిని వెంటనే శుభ్రపరిచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇస్కేషాప్‌అలీ,ఇంచార్జీ హెచ్ఎం మంగ, సీఆర్పీ రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన తొమ్మిది ఇళ్లు


కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కార్యదర్శి స్వప్న

హత్నూర(సంగారెడ్డి): భారీ వర్షాలకు హత్నూర మండలంలోని పలు గ్రామాల్లో ఎనిమిది ఇళ్లు పాక్షికంగా.. ఒక ఇల్లు పూర్తిగా కూలిపోయాయని గురువారం తహసీల్దార్ పర్వీన్ షేక్ పేర్కొన్నారు. హత్నూర మండలంలోని రెడ్డి ఖానాపూర్ గ్రామంలో మూడు, ముచ్చర్ల గ్రామంలో ఒకటి, కాసాలలో మూడు పెంకుటిల్లు పాక్షికంగా కూలిపోయాయి. గుండ్ల మాచునూరు గ్రామంలో ఒక పెంకుటిల్లు పూర్తిగా కూలిపోయినట్లు తెలిపారు. పాక్షికంగా ఇల్లు కూలిపోయిన వారికి ప్రభుత్వం తరపున రూ. 4000, పూర్తిగా ఇల్లు కూలిపోయిన వారికి రూ. 6500లను ప్రభుత్వం బాధితుల బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు చెప్పారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని వివరించారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం కోర్టులో హాజరు పరచగా ఏడుగురికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా, మరో ఇద్దరికిరూ. 1500, ఒకిరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.


రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

- అధికారుల నిర్లక్ష్యం
- రోడ్డు నిర్మాణంలో జాప్యం
- అవస్థలు పడుతున్న ప్రజలు


అల్గోల్ రోడ్డుపై నుంచి పారుతున్న వరద నీరు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ బైపాస్ రోడ్డు నుంచి అల్గోల్, భరత్‌నగర్ వైపు వెళ్లే రోడ్డు నిర్మాణంలో జాప్యంతో ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ రోడ్డుపై వరద పారడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో రోడ్డుపై నుంచి నడుము లోతు నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ రోడ్డు గుండా కర్నాటక రాష్ట్రంలోని బీదర్‌తో పాటు అల్గోల్, న్యాల్‌కల్, మిర్జాపూర్, గంగ్వార్, దిడ్గి, కొత్తూర్(బి), అల్గోల్, భరత్‌నగర్, ఎల్గోయి, పాట్‌పల్లి తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగుస్తుంటారు. బైపాస్‌కు దగ్గర రోడ్డు మధ్య నుంచి వాగు ప్రవహిస్తుంది. జహీరాబాద్ పట్టణం నుంచి వరద, మురికి నీరు వాగు నుంచి వెళ్లుతుంది. రాకపోకలకు ఇబ్బందులు ఇబ్బందులు ఏర్పడుతుండటంతో ఇక్కడ బ్రిడ్జితో పాటు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపారు. మూడు సంవత్సరాల క్రితం రూ. 33 లక్షల నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ నత్తనడకన బ్రిడ్జి పనులు పూర్తి చేసి ఇంత వరకు రోడ్డు పనులు ప్రారంభించలేదు. దీంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. వర్షం కురిస్తే రాకపోకలు సాగించడం కష్టమవుతుంది. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి గోతులు ఎక్కడ ఉన్నాయో తెలియక వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి పనులు రహదారి పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యర్థజలాల విడుదలతో అవస్థలు


వర్షం మాటున తురుంకుంటలో ప్రవహిస్తున్న వ్యర్థజలాలు

జిన్నారం (పటాన్‌చెరు): భారీ వర్షాలకు జిన్నారం మున్సిపాలిటీలోని చెరువులు, కుంటలన్నీ నిండి జలకళను సంతరించుకున్నాయి. వర్షం మాటున గడ్డపోతారం, బొల్లారం, బొంతపల్లి పారిశ్రామిక వాడలోని పలు రసాయన పరిశ్రమలు వ్యర్థజలాలను విడుదల చేశారు. దీంతో చెరువులు, కుంటలన్నీ పచ్చటి రంగుతో కంపు కొడుతున్నాయి. నియోజకవర్గంలోని అతిపెద్ద చెరువు జిన్నారంలోని రాయిని చెరువు పూర్తిగా వ్యర్థాలతో నిండి అలుగు పారుతుంది. గడ్డపోతారం పట్టణ పరిధిలోని అయ్యమ్మ చెరువులో భారీగా వరదనీరు చేరడంతో ఆ నీరు తురుంకుంటలో విషజలాలు ఏరులై పారుతున్నాయని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వ్యర్థజలాలు కుంటలు, కాల్వల్లో చేరడంతో మూగజీవులు తాగి మత్యువాత పడే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వ్యర్థజలాలు తాగి పదుల సంఖ్యలో మూగజీవులు మృత్యువాత పడ్డాయి. అధికారులు చర్యలు చేపట్టి వ్యర్థజలాల విడుదలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్నారు..

కల్హేర్(నారాయణఖేడ్): అభివృద్ధి చేయడం చేతకాక ప్రహరీ నిర్మాణం పనులను కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటున్నారని మాజీ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ అలీ, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణాగౌడ్ ఆరోపించారు. గురువారం కృష్ణాపూర్ పీఏసీఎస్ ప్రహరీ నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీఏసీఎస్ సంబంధించి 21 గుంటలు భూమి ఉంది. ఇందులో కొందరు అక్రమంగా చికెన్ షాపులు, ఇతర దుకాణాలు ఏర్పాటు చేశారని ఆరోపించారు. భూమి అక్రమణకు గురికాకుండా ఉండేందుకు జిల్లా అధికారుల అనుమతితో ప్రహరీ నిర్మాణం పనులు చేపడుతుండగా కాంగ్రెస్ నాయకులు అధికారం, పోలీసు వ్యవస్థను వాడుకుంటూ పనులను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ రాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దాడె పండరి, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు గోడవ..

భూమి పూజ చేస్తుండగా కాంగ్రెస్ నాయకులు కొందరు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య గొడవకు దారితీసింది. అక్కడి చేరుకున్న పోలీసులు ఇరువర్గాల నాయకులను చెదరగొట్టారు.

ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పేదింటి ఆడపడుచుల వివాహాలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని గుమ్మడిదల, జిన్నారం, అమీన్‌పూర్ , పటాన్‌చెరు, రామచంద్రాపురం రెవెన్యూ మండలాల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 180 మందికి రూ.1.80 కోట్ల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా వడ్డీలేని రుణాలను అందిస్తూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టుకుమార్ యాదవ్, పుష్ప నగేష్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ దేవానందం తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం కమిషనర్‌గా తిరుపతి



జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మున్సిపల్ కమిషనర్‌గా తిరుపతి నియామకమైనట్లు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ మేరకు ఆయన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఇస్నాపూర్,ఇంద్రేశంకు కొత్త కమిషనర్లు

పటాన్‌చెరు: నూతనంగా ఏర్పడిన ఇంద్రేశంకు మున్సిపల్ కమిషనర్‌గా మధుసూదన్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన బొల్లారం మున్సిపాలిటీ నుంచి బదిలీపై ఇక్కడికి రానున్నారు. ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీహరి బదిలీపై జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ ఆఫీస్‌కు వెళ్లనున్నారు. ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ ప్రాజెక్టర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట కిషన్ రావు బదిలీపై ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

కేజీవీబీలో డిగ్రీ కోర్స్ ఏర్పాటుకు కృషి

మునిపల్లి(అందోల్): తాటిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో డిగ్రీ కోర్స్ ఏర్పాటుకు మంత్రి దామోదర దృష్టికి తీసుకెళ్తానని మాజీ ఎంపీపీ రాంరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. తాటిపల్లి కేజీవీబీలో డిగ్రీ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ప్రిన్సిపాల్ కవిత, విద్యార్థులు రాంరెడ్డికి తెలిపారు. మంత్రితో మాట్లాడి డిగ్రీ వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాయికోడ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైపాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రదీప్‌రెడ్డి, పీఆర్ఎఈ మానిష్, కేజీవీబీ ప్రిన్సిపాల్ కవిత, పంచాయతీ కార్యదర్శి సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్ట్‌మెన్‌పై ఫిర్యాదు

జహీరాబాద్ టౌన్: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోస్ట్‌మెన్‌పై మొగుడంపల్లి మండల ప్రజలు జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. మొగుడంపల్లి పోస్ట్‌మెన్ విధులను విస్మరిస్తూ పోస్టులో వచ్చిన విలువైన సమాచారాన్ని తెలియజేయడం లేదని ఆరోపించారు. రైతుల పట్టాపాస్ పుస్తకాలను కూడా ఇవ్వకుండా వెనక్కిపంపుతున్నాడని ఆరోపించారు. ఫోన్ చేసిన లిఫ్ట్‌చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్ట్‌మెన్ వైఖరి వల్ల నష్టపోతున్నామని ఆయనపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

మెరుగైన సేవలు

నారాయణఖేడ్: ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తామని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. పలువురు ప్రయాణికులు, ప్రజలు ఫోన్ చేసి ఖేడ్ నుంచి సిర్గాపూర్ మీదుగా పిట్లం, బిజిలీపూర్ మీదుగా జోగిపేట, తడ్కల్, పిట్లం, బాన్సువాడల మీదుగా కామారెడ్డి, కంగ్టి నుంచి లింగంపల్లి, తడ్కల్ నుంచి హైదరాబాద్, బీబీపేట మీదుగా పిట్లంకు బస్సులు నడపాలని కోరారు.

గుంతల రోడ్లను బాగు చేయండి


ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హత్నూర(సంగారెడ్డి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు హత్నూర మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. వెంటనే మరమ్మతులు చేయించాలని గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ శంకర్ వినతిపత్రం అందజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఓబీసీ మోర్చా రాష్ట ఉపాధ్యక్షుడు పాపగారి రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయని ఆర్టీసీ బస్సులు తిరగడం కష్టంగా ఉందన్నారు. ప్రజలు విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేశ్, అసెంబ్లీ కో కన్వీనర్ ఎర్ర సతీష్ ,శ్రీశైలం, బీజేపీ మండల నాయకులు కుమార్, మల్లేశ్, పాండు, ప్రవీణ్‌గౌడ్, శివ, రామాగౌడ్, సాయిబాబా, అనిల్, మహేశ్, సాయిరాం గౌడ్‌తో పాటు పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వంతెనకు మరమ్మతులు చేపట్టండి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి


వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: ఖేడ్ మండలం అంత్వార్, అనంత్‌సాగర్ గ్రామాల మధ్య ఉన్న రెండు లోలెవల్ కాజ్‌వేలు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. దీంతో ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి గురువారం వంతెనను పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు

ప్రజలకు అందుబాటులో ఉండాలి

జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి జోన్: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ సూచించారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ పోలీస్ స్టేషన్‌లకు సంబంధించిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. వివిధ రకాల నేరాలతో పాటు ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగాం నిర్వహిస్తూ కొత్త వ్యక్తులను గుర్తించి, సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయాలన్నారు. గంజాయి వినియోగించే వారితోపాటు అమ్మే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని చెప్పారు. వివిధ కేసుల్లో నిందితులకు జీవిత జైలు శిక్ష పడేలా కృషి చేసిన వారిని అభినందించారు. సమావేశంలో డీఎస్పీలు సత్తయ్యగౌడ్, ప్రభాకర్, సైదా నాయక్, వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లవాగు కాల్వ గండిని పూడ్చండి

కల్హేర్(నారాయణఖేడ్): నల్లవాగు ప్రాజెక్టు కుడి కాల్వకు పడిన గండిని పూడ్చడంలో ఇరిగేషన్ అధికారులు విఫలమయ్యారని బీజేపీ మండల అధ్యక్షుడు ఎన్నం అనిల్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని బీబీపేట్ జంల తండా శివారులో కాల్వకు గండి పడిన ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు నిండినా చివరి ఆయకట్టు వరకు నీరు అందక రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాల్వల ఆధునీకరణలో పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు గుండు అనిల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బియ్యం పంపిణీపై అవగాహన

మునిపల్లి(అందోల్): మండలంలోని ఆయా గ్రామాలకు కొత్తగా 2,112 (యూనిట్ల) రేషన్ కార్డులకు సంబంధించి అథరైజేషన్ రెన్యువల్ డీలర్లకు బియ్యం పంపిణీపై ఉప తహసీల్దార్ ప్రదీప్ అవగాహన కల్పించారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో ఆయా గ్రామాల రేషన్ డీలర్లకు బియ్యం పంపిణీపై పలు సూచనలు చేశారు. డీలర్లు బియ్యం పంపిణీలో సమయపాలన పాటించాలని సూచించారు. ప్రతి ఒక్క లబ్దిదారులకు రేషన్ పంణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నాగిశెట్టి, ప్రధాన కార్యదర్శి, ఆయా గ్రామాల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అధికారులు

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రహదారుల వివరాలు పంచాయతీ రాజ్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నూతన రహదారుల మంజూరు చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారుల దృష్టికి తెచ్చారు. పంచాయతీ రాజ్ మినిస్టర్‌కు లేఖ ద్వారా పనులు పూర్తి చేయాలని కోరుతానని అన్నారు. అనంతరం పనుల జాతర కార్యక్రమానికి రావాలని ఎమ్మెల్యేను పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఆహ్వానించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ఈఈ యుగేంధర్, డి ఈలు దీపక్, సుభాష్ ఉన్నారు.

వసతులు మెరుగు పరచాలి

సంగారెడ్డి: వసతి గృహాల్లో వసతులు మెరుగుపరచాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం వసతి గృహ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రైవేట్ భవనాల్లో వసతి గృహాలు ఉండటం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వ భవనాలు మంజూరుకు కృషి చేయాలని ఎమ్మెల్యేను అధికారులను కోరారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, వసతి గృహ సంక్షేమ అధికారులు కృష్ణ, కవిత, మంజుల, గౌస్ హష్మీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ధర్నాను జయప్రదం చేయాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల సాధన కోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) పిలుపునిచ్చింది. సంగారెడ్డిలోని టీపీటీఎఫ్ భవన్‌లో గురువారం ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు.

◆ పర్యావరణ పరిరక్షణ బాధ్యత

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాలు, హరితహారం కమిటీ ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మాకే నామ్‌ఫర్ అనే కార్యక్రమంలో భాగంగా హరితహారం కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు.

◆ సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం

పటాన్‌చెరు టౌన్: బ్యాంకు ఎగ్జిక్యూటివ్‌గా నటిస్తూ, ప్రీమియం సర్వీసులు కలిగిన క్రెడిట్ కార్డులు మంజూరు చేస్తామని చెప్పి సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో మోసాలకు తెర తీస్తున్నారు. అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డీఓటీ సిమ్ వెరిఫికేషన్ పేరుతో బాధితులకు నకిలీ బ్యాంక్ స్టిక్కర్లు ఉన్న వాటిని పంపించి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని సూచించారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930 కాల్ చేస్తే నగదు ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

◆ మండపాల నిర్వాహకులకు అవగాహన

మునిపల్లి(అందోల్): వినాయక మండపాల నిర్వాహకులకు ఈ నెల 22న 10.30 గంటలకు సంగారెడ్డి మండలం మల్కాపూర్ గ్రామ శివారు సమీపం గోకుల్ ఫంక్షన్ హాలులో అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు బుదేరా పోలీస్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల వినాయక మండపాల నిర్వాహకులు, గ్రామపెద్దలు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొనాలని కోరారు.

◆ శ్రమదానం..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆధ్యాపకులు, విద్యార్థులు కలసి శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చుట్టు పక్కల పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పర్యావరణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.